క్లుప్తంగా

మహిళలకు కుట్టుమిషన్ ఉచిత శిక్షణ

ఆమనగల్లు: మాడ్గుల మండల కేంద్రంలో ఈనెల 18 నుంచి ఐక్యతా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళలకు కుట్టుమిషన్, ఎంబ్రాయిడరీపై ఉచిత శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి గురువారం ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 35 సంవత్సరాలలోపు మహిళలకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. మాడ్గుల మండల పరిధిలోని అన్ని గ్రామాలకు చెందిన మహిళలు ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని రాఘవేందర్‌రెడ్డి కోరారు.

కొనసాగుతున్న 'కంటివెలుగు'

ఆమనగల్లు: ఆమనగల్లు మున్సిపాలిటీలో పరిధిలోని చంద్రాయణపల్లి తండాలో గురువారం నిర్వహించిన కంటివెలుగు కార్యక్రమంలో 171 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. డాక్టర్లు పరిక్షిత్‌నరేందర్, మంజులాదేవి, సిబ్బంది తిరుపతిరెడ్డి, నవీన్, కౌన్సిలర్ కృష్ణనాయక్ తదితరులు పాల్గొన్నారు.

15 నుంచి క్రీడాపోటీలు

ఆమనగల్లు: మాడ్గుల మండల కేంద్రంలో ఈనెల 15 నుంచి 17 వరకు చీఫ్ మినిస్టర్ కప్–2023 మండలస్థాయి క్రీడాపోటీలను నిర్వహిస్తున్నట్లు మాడ్గుల ఎంపీడీఓ రాఘవులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 3 రోజుల పాటు నిర్వహించే పోటీల్లో 15 సంవత్సరాల నుంచి 36 సంవత్సరాల లోపు యువతీయువకులు పాల్గొనవచ్చని ఆయన చెప్పారు. మండలస్థాయి క్రీడాపోటీల్లో వందమీటర్లు, 400 మీటర్ల పరుగుపందెం, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలను యువతీ, యువకులకు వేర్వేరుగా నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. పోటీల్లో పాల్గొనాలనుకునే యువతీయువకులు ఈనెల 15లోపు పేర్లు నమోదు చేయించుకోవాలని సూచించారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబర్చే వారిని జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక చేస్తారన్నారు.

కూరగాయల మార్కెట్ ఏర్పాటుకు కృషి

సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి

కడ్తాల్: వారాంతపు సంత నిర్వహిస్తున్న సమయంలో వర్షాలు, ఎండల వేడిమికి ఇబ్బందులు ఎదుర్కొంటున్న కూరగాయల వ్యాపారులను దృష్టిలో పెట్టుకుని మండల కేంద్రంలో కూరగాయల మార్కెట్, అదే విధంగా వారాంతపు సంతలు నిర్వహించుకునేందుకు వీలుగా అనువైన స్థలాలను కేటాయించాలని సంబంధిత అధికారులకు ప్రతిపాదనలు పంపించడం జరిగిందని గ్రామ సర్పంచ్ గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలో గురువారం జరిగే వారాంతపు సంతను గురువారం ఆయన పరిశీలించి కూరగాయల వ్యాపారులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. కడ్తాల్ పట్టణం వేగంగా అభివృద్ధి చెందుతున్న తరుణంలో వినియోగదారులను, వ్యాపారులను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేకంగా మార్కెట్ నిర్మించాల్సిన అవశ్యకత ఉందని తెలిపారు. సమస్యను ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ దృష్టికి తీసుకువెళ్లి మార్కెట్ ఏర్పాటుకు కృషి చేస్తామని తెలిపారు. స్థానిక నాయకులు, వార్డు సభ్యులు ఉన్నారు.

అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు ప్రారంభం



డ్రైనేజీ పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ మమత

మంచాల: మండల పరిధిలోని రంగాపూర్‌లో ఎమ్మెల్యే నిధులు రూ.10లక్షలతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను గ్రామ సర్పంచ్ డబ్బీకార్ మమత గురువారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి సహకారంతో గ్రామంలో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు సర్పంచ్ తెలిపారు. ఉప సర్పంచ్ జంగారెడ్డి, మాజీ సర్పంచ్‌లు చంద్రమ్మ, బాలకృష్ణ, వార్డు సభ్యులు, స్థానిక నాయకులు మల్లేష్, దిలీప్ రెడ్డి, విజయ్‌కుమార్, జంగయ్య, అంజయ్య, లక్ష్మీబాయి తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీ భవన నిర్మాణ పనుల్లో వేగం పెంచండి

జెడ్పీటీసీ దశరథ్‌నాయక్

కడ్తాల్: 2023–24 విద్యాసంవత్సరం ప్రారంభం నాటికి పాఠశాల భవన నిర్మాణ పనులను పూర్తి చేయాలని భవన నిర్మాణ కాంట్రాక్టర్ శ్రీనివాస్‌కు జెడ్పీటీసీ జర్పుల దశరథ్‌నాయక్ సూచించారు. మండల కేంద్రంలో నిర్మిస్తున్న కేజీబీవీ పాఠశాల భవన నిర్మాణ పనులను గురువారం స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ఆయన పరిశీలించారు. భవన నిర్మాణ పనులను వేగవంతం చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఎస్‌ఓ అనిత, ఎంపీటీసీ ప్రియా రమేశ్, సింగిల్‌విండో డైరెక్టర్ సేవ్యా, మార్కెట్ కమిటీ డైరెక్టర్ లాయక్‌అలీ, ఉపసర్పంచ్ శారద, వార్డు సభ్యులు లక్ష్మన్, భిక్షపతి, రాంచంద్రయ్య, భూమయ్య తదితరులు ఉన్నారు.



నిర్మాణ పనులను పరిశీలిస్తున్న జెడ్పీటీసీ దశరథ్‌నాయక్

పొంచి ఉన్న ప్రమాదం

- నక్కర్తమేడిపల్లి–నానక్‌నగర్ రోడ్డులో దెబ్బతిన్న కల్వర్టు
- వర్షాలకు రోడ్డుపై నుంచి పారుతున్న వరద
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు



నక్కర్తమేడిపల్లి–నానక్‌నగర్ మధ్యన దెబ్బతిన్న కల్వర్టు

యాచారం: నక్కర్తమేడిపల్లి–నానక్‌నగర్ గ్రామాల మధ్యన బీటీరోడ్డు గతేడాది కురిసిన భారీ వర్షాలకు పూర్తిగా దెబ్బతింది. నక్కర్తమేడిపల్లి గ్రామ సమీపంలోని కల్వర్టు వద్ద వర్షాలు కురిసినప్పుడు వరద వల్ల కల్వర్టు పూర్తిగా దెబ్బతింది. అసలే ఇరుకు రోడ్డు ఆపై కల్వర్టు పూర్తిగా దెబ్బతినడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. కల్వర్టు ప్రాంతంలో వరద భారీగా వస్తే పూర్తిగా రాకపోకలు బంద్ అయ్యే అవకాశం ఉందని వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అలాగే కల్వర్టు ఉన్న రోడ్డు ప్రాంతం కుంగిపోయే అవకాశాలున్నాయి. ఎలాంటి ప్రమాదం జరగక ముందే మరమ్మతులు చేపట్టాలని పలుమార్లు గ్రామస్తులు, వాహనదారులు రోడ్డు భవనాల శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. రాతపూర్వకంగా ఫిర్యాదు చూడా చేశారు. మండల పరిషత్ సర్వసమావేశాల్లోనూ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అయినప్పటికీ ఎలాంటి ఫలితం లేదు. మళ్లీ వర్షాకాలం రానున్న నేపథ్యంలో తక్షణమే కల్వర్టు మరమ్మతులు చేపట్టాలని లేని పక్షంలో కల్వర్టు వద్ద స్థానికులు, వాహనదారులతో కలిసి ధర్నా నిర్వహిస్తామని నానక్‌నగర్ సర్పంచ్ దంతుక పెద్దయ్య తెలిపారు.

నిబంధనలు పాటించకుంటే చర్యలు

హోటల్స్, లాడ్జీల నిర్వాహకులతో సీఐ మన్మోహన్ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ మన్మోహన్

అబ్దుల్లాపూర్‌మెట్: అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో కొనసాగుతున్న హోటల్స్ మరియు లాడ్జీల యజమానులు ప్రభుత్వ నిబంధనల తప్పక పాటించాలని.. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే లాడ్జీలను సీజ్ చేయడంతో పాటు నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామని సీఐ మన్మోహన్ హెచ్చరించారు. స్టేషన్ ఆవరణలో హోటల్స్ మరియు లాడ్జీల నిర్వాహకులతో గురువారం ఆయన సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ మన్మోహన్ వారికి పలు సూచనలు చేశారు.

1. ప్రతి హోటల్ మరియు లాడ్జీలను తప్పనిసరిగా నిర్దేశించిన సమయంలోగా మూసివేయాలి.
2. హోటల్ మరియు లాడ్జీలలో బసచేసే వ్యక్తుల యొక్క గుర్తింపు కార్డులను మరియు వారి పూర్తి వివరాలను సేకరించి తప్పనిసరిగా ప్రతిరోజు పోలీసులకు సమాచారం ఇవ్వాలి.
3. లాడ్జీల్లో ఎలాంటి అసాంఘీక చర్యలకు అనుమతించినా నిర్వాహకులపై సెక్షన్–133 సీఆర్ ప్రకారం ఆర్డీఓ అనుమతితో వాటిని సీజ్ చేయాల్సి వస్తుంది. చర్యలు తీసుకుంటాం.
4. హోటల్ మరియు లాడ్జీలలో మద్యం, పేకాట, హుక్కా మొదలగు వాటికి అనుమతిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.
5. ప్రతి హోటల్ మరియు లాడ్జీలలో తప్పనిసరిగా సీసీ కెమెరాలను కనీసం 30 రోజుల బ్యాకప్‌తో ఏర్పాటు చేసుకోవాలి.
6. ఎవరైనా అనుమానితులు లాడ్జీల్లో బసచేసినట్లు తెలిస్తే తక్షణమే స్థానిక పోలీసులకు కానీ డయల్ 100కి కానీ సమాచారం ఇవ్వాలి.
7. హోటల్ మరియు లాడ్జీల వద్ద తప్పనిసరిగా సెక్యూరిటీ గార్డ్స్‌ను నియమించుకోవాలి.

మృత్యు కుహరం

- యాచారంలో క్వారీ గుంతతో పొంచి ఉన్న ప్రమాదం
- ప్రహరీ నిర్మించాలని స్థానికుల డిమాండ్



యాచారంలోని క్వారీ గుంత

యాచారం: సాగర్ రోడ్డు పక్కనే ఉన్న ఓ క్వారీ ప్రమాదకరంగా మారింది. నగరానికి చెందిన ఓ వ్యాపారి యాచారం పోలీస్ స్టేషన్ వెనుకాల క్వారీ కోసం అర ఎకరా విస్తీర్ణంలో 30 అడుగులకు పైగా పెద్ద గోతిని తవ్వాడు. తనకు కావాల్సిన రాయిని తరలించి అలానే వదిలేశాడు. ఇటీవల కురిసిన వర్షాల వల్ల క్వారీగుంతలో ప్రస్తుతం 10 అడుగుల మేర నీళ్లు నిల్వ ఉన్నాయి. క్వారీ గోతికి చుట్టూ గోడ నిర్మించకపోవడంతో ప్రమాదకరంగా మారింది. క్వారీ తీసిన అనంతరం గోతిని పూడ్చాలనే నిబంధన ఉన్నా సదరు వ్యాపారి అవేమీ పట్టించుకోలేదు. క్వారీ గుంత పక్క నుంచి రైతులు రాకపోకలు సాగించడం, వాహనాలు కూడా వెళ్తుండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో అర్థంకాని పరిస్థితి ఉంది. స్థానికంగా ఉన్న యువత ఈ గోతిలో ఈత కూడా కొడతారు. ప్రమాదాలు జరిగే అవకాశమున్న ఈ గోతి చుట్టూ గోడను నిర్మించాలి. లేదంటే పూడ్చే విధంగా అధికారులు చర్యలు

ఇద్దరు బైకు దొంగల అరెస్ట్

నాలుగు ద్విచక్రవాహనాల స్వాధీనం

హస్తినాపురం: జల్సాలకు అలవాటుపడి అవసరమైన డబ్బుల కోసం ద్విచక్రవాహనాలను దొంగిలిస్తున్న ఇద్దరు పాతనేరస్తులను వనస్థలిపురం పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. గురువారం ఇన్‌స్పెక్టర్ దేవ జలేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ముసారాంబాగ్ ముక్తర్‌వాడకు చెందిన కేసరియా హరీష్ (29) ఈనెల 8న వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని చింతలకుంట రేడియో స్టేషన్ టవర్ ముందు పార్కుచేసిన హోండా యాక్టివాను దొంగిలించాడు. గురువారం ఉదయం పనామా చౌరస్తా దగ్గర పోలీసులు వాహన తనిఖీలు చేస్తుండగా హరీష్ బైక్ (నం. టీఎస్07జేఎల్ 7684) పై వెళ్తున్నాడు. అతడిని ఆపి బండి పత్రాలు చూపించమనగా పారిపోయేందుకు యత్నించాడు. దీంతో అదుపులోకి తీసుకుని విచారించగా బైక్ చోరీ చేసి తెచ్చినట్టు తెలిపాడు. గతంలో హరీష్‌పై పేట్‌బషీరాబాద్, జీడిమెట్ల, మలక్‌పేట, చాదర్‌ఘాట్ పోలీస్‌స్టేషన్లలో దొంగతనం కేసులు నమోదయ్యాయని పోలీసులు తెలిపారు. ఇదిలా ఉండగా, హయత్‌నగర్ ముదిరాజ్ కాలనీకి చెందిన గుజ్జుల రాములు (26) జల్సాలకు అలవాటుపడి బైకు చోరీలకు పాల్పడుతున్నాడు. గురువారం సాగర్‌రోడ్డుపై బీఎన్‌రెడ్డినగర్ దగ్గర వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు బైకుపై వెళ్తున్న రాములును ఆపి తనిఖీ చేయగా పారిపోయేందుకు ప్రయత్నించాడు. అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని అంగీకరించాడు. ఇద్దరినీ అరెస్ట్‌చేసి రిమాండ్ కు తరలించి వారివద్ద నుంచి నాలుగు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

దాసోజు శ్రవణ్‌కు సత్కారం



దాసోజు శ్రవణ్‌తో అనంతరెడ్డి, నాయకులు

ఆమనగల్లు: బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దాసోజు శ్రవణ్‌కుమార్‌ను ఆమనగల్లు బీఆర్‌ఎస్ నాయకులు ఘనంగా సత్కరించారు. దాసోజు శ్రవణ్ గురువారం ఆమనగల్లు పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయానికి వచ్చిన సందర్భంగా వైస్ ఎంపీపీ జక్కు అనంతరెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు విజయ్ ఆయనను సత్కరించారు. బీఆర్‌ఎస్ నాయకులు మురళి, చందురెడ్డి, వెంకట్‌రెడ్డి, శ్రీను, రమేష్, కుమార్, బాలరాజు, అంతయ్య, కృష్ణ, మధు, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

రేపు టీడీపీ మినీ మహానాడు

ఆమనగల్లు: టీడీపీ నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి మినీ మహానాడును ఈ నెల 13న నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్‌లో నిర్వహించనున్నట్లు ఆ పార్టీ కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ యాదీలాల్ తెలిపారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ.. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో అధికారమే లక్ష్యంగా టీడీపీ ముందుకు సాగుతుందని చెప్పారు. కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గంలో నిర్వహిస్తున్న ఇంటింటికి టీడీపీ కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు భాస్కర్, మల్లయ్య, వెంకటేశ్, కుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

హరిహర క్షేత్రంలో ప్రత్యేక పూజలు

యాచారం: మండలంలోని చౌదర్‌పల్లి హరిహర క్షేత్రంలో ప్రతిష్ఠించనున్న దేవతా విగ్రహాలకు గురువారం మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ క్షేత్రంలో రాజరాజేశ్వరి సమేత చంద్రమౌళీశ్వర స్వామి, గణపతి, నంది, ధ్వజస్తంభ, నవగ్రహ పరివార దేవతలను ప్రతిష్ఠించనున్నారు. హంపి పీఠాధిపతి విద్యారణ్య భారతి స్వామిజీ ఆధ్వర్యంలో విగ్రహాల ప్రతిష్ఠాపన జరగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

రోడ్డుకు 'ఎర్రపూల అందాలు'

మంచాల: మండల కేంద్రంలోని మంచాల–జాపాల రోడ్డుకు ఇరువైపులా ఎర్రపూల అందాలు చూపరులను ఆకట్టుకుంటున్నాయి. హరితహారంలో భాగంగా నాటించిన మొక్కలు నేడు చెట్లుగా ఎదిగి పూలుకాసి రోడ్డుకే అందంగా కనిపిస్తున్నాయి.



స్కేటింగ్‌కు పెరుగుతున్న ఆదరణ

- వనస్థలిపురంలో రూ.70 లక్షలతో గ్రౌండ్ అభివృద్ధి
- ప్రతిరోజూ 40 నుంచి 50 మందికి ఉచితంగా శిక్షణ
- ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



ఇన్‌లైన్ హాకీ ఇండియా జట్టుకు ఎంపికైన విద్యార్థులతో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

వనస్థలిపురం: క్రీడలు మానసిక ఉల్లాసంతోపాటు దేహదారుఢ్యాన్ని పెంపొందిస్తాయి. నేడు చదువుల ధ్యాసలో పడి విద్యార్థులు క్రీడలను అంతగా పట్టించుకోవడం లేదు. దీంతో మానసిక, శారీరక రుగ్మతలకు గురవుతున్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో వేసవి సెలవుల్లో పలు క్రీడా ప్రాంగణాలలో వివిధ రకాల క్రీడల్లో యువతకు ఉచిత శిక్షణ అందిస్తున్నారు. ఇందులో భాగంగా వివిధ ఆటలతో పాటు ఇప్పుడిప్పుడే ప్రాచుర్యం పొందుతున్న స్కేటింగ్, ఇన్‌లైన్ హాకీ నేర్చుకోవడానికి విద్యార్థులు ఆసక్తి చూపిస్తున్నారు.

- వనస్థలిపురం ఫేజ్–1 ఏ–టైపు క్వార్టర్స్‌లోని క్రీడా ప్రాంగణంలో జీహెచ్‌ఎంసీ నిధులు రూ. 70 లక్షలతో అధునాతన స్కేటింగ్ గ్రౌండ్ నిర్మించారు. ఎస్‌ఎస్ రోలర్ అండ్ ఇన్‌లైన్ హాకీ క్లబ్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు టంగుటూరి నాగరాజు ప్రోద్బలంతో ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి నిధులు మంజూరు చేయించి స్కేటింగ్ గ్రౌండ్ అభివృద్ధికి కృషి చేశారు.
- దీంతో స్కేటింగ్ స్పీడ్, ఇన్‌లైన్ హాకీ నేర్చుకోవడానికి ఇక్కడ ప్రాంగణం సిద్ధమైంది. ప్రస్తుతం రోజు 40 నుంచి 50 మంది ఇక్కడ స్కేటింగ్‌లో శిక్షణ పొందుతున్నారు. ఇక్కడ శిక్షణ పొందిన వారిలో ఐదుగురు విద్యార్థులు జాతీయ స్థాయిలో ఆడేందుకు ఇండియా జట్టుకు ఎంపికయ్యారు.
- ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి బుధవారం ఇన్‌లైన్ హాకీ ఇండియా జట్టుకు ఎంపికైన విద్యార్థులు శ్రీమాన్, నందిత, శ్రీపత్, సాయిచంద్ర, తన్మయ్‌లను అభినందించి భవిష్యత్‌లో వారు క్రీడల్లో మెరుగ్గా రాణించి దేశానికి పేరు తేవాలని ఆకాంక్షించారు.
- అలాగే స్కేటింగ్ గ్రౌండ్‌ను ఇండోర్ స్టేడియంగా అభివృద్ధి చేస్తామని, సిట్టింగ్ గ్యాలరీ, టాయిలెట్లు, డ్రెస్ చేంజ్ గదులు, తాగునీరు, క్లీనర్స్ తదితర అన్నిరకాల సౌకర్యాలు కల్పిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.



స్కేటింగ్ గ్రౌండ్‌లో ఇన్‌లైన్ హాకీ ఆడుతున్న విద్యార్థులు

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

ఆమనగల్లు: ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ కోరారు. మాడ్గులకు చెందిన కార్తీక్ కిడ్నీ సంబంధిత వ్యాధితో హైదరాబాద్ గచ్చిబౌలిలోని ఏఐజీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. బాధితుడు కార్తీక్‌ను గురువారం ఆస్పత్రిలో ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ పరామర్శించారు. అనంతరం కార్తీక్ చికిత్స కోసం ముఖ్యమంత్రి సహాయనిధి పథకం కింద మంజూరైన రూ.8 లక్షల చెక్కును బాధిత కుటుంబ సభ్యులకు అందించారు. ముఖ్యమంత్రి సహాయనిధి పథకం పేదలకు వరంగా మారిందని చెప్పారు. సీఎంఆర్‌ఎఫ్‌తో పేదలకు కార్పొరేట్ వైద్యం అందుతుందని ఆయన చెప్పారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి ప్రభుత్వం బస్తీ దవాఖానాలు, పల్లె దవాఖానాలు ఏర్పాటు చేసిందని చెప్పారు. అంతకుముందు ఎమ్మెల్యే నివాసంలో మాడ్గుల మండలం ఫిరోజ్ నగర్ గ్రామానికి చెందిన అంజయ్యకు సీఎంఆర్‌ఎఫ్ కింద మంజూరైన రూ.లక్ష చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. ఈ కార్యక్రమంలో మాడ్గుల సర్పంచ్ జంగయ్యగౌడ్, మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు జైపాల్ రెడ్డి, మండల వైస్ ఎంపీపీ శంకర్‌నాయక్, సింగిల్ విండో చైర్మన్ తిరుమల్‌రెడ్డి, పల్గుతండా సర్పంచ్ వస్రంనాయక్, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

రూ.60 వేల చెక్కు అందజేత..

యాచారం: సీఎం రిలీఫ్ ఫండ్‌తో పేదల్లో ఆర్థిక భరోసా కలిగిందని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని నల్లవెల్లి గ్రామానికి చెందిన దండుగుల ఐలయ్యకు గురువారం ఇబ్రహీంపట్నం క్యాంపు కార్యాలయంలో రూ.60 వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రమేష్‌గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి భాషా, జెడ్పీటీసీ సభ్యురాలు జంగమ్మ, నందివనపర్తి మాజీ సర్పంచ్ రాజునాయక్, నల్లవెల్లి బీఆర్‌ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు రవిగౌడ్ తదితరులు ఉన్నారు.

మార్కెట్ యార్డు ఆదాయ అభివృద్ధికి కృషి



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి

ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డులో రూ.50 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను గురువారం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సాగర్ రోడ్డు నుంచి బృందావన్ కాలనీకి ఈ సీసీ రోడ్డు లింకు అవుతుందన్నారు. రోడ్డుకు ఇరువైపులా దుకాణ సముదాయాలను నిర్మించి మార్కెట్ యార్డుకు ఆదాయం సమకూరేలా చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ చంద్రయ్య, వైస్ చైర్మన్ రవీందర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ స్రవంతి, వైస్‌చైర్మన్ యాదగిరి, మార్కెట్ సెక్రటరీలు సంతోష్, శ్రీనివాస్, డైరెక్టర్లు, కౌన్సిలర్లు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ సేవలు అభినందనీయం

ఏఎస్‌ఐ సీతారాంరెడ్డి



ప్రయాణికులకు రాగిఅంబలి అందిస్తున్న ఏఎస్‌ఐ సీతారాంరెడ్డి

కడ్తాల్: లయన్స్‌క్లబ్ ఆఫ్ ఆమనగల్లు ఆధ్వర్యంలో అందిస్తున్న సేవలు అభినందనీయమని ఏఎస్‌ఐ సీతారాంరెడ్డి అన్నారు. మండల కేంద్రంలో 11 రోజులుగా లయన్స్‌క్లబ్ డిస్ట్రిక్ట్ మాజీ గవర్నర్ చెన్న కిషన్‌రెడ్డి సహకారంతో నిర్వహిస్తున్న రాగి అంబలి కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఎస్‌ఐ మాట్లాడుతూ.. ఎండాకాలంలో పేద ప్రజల, ప్రయాణికుల దాహార్తిని తీర్చడానికి రాగి అంబలిని ఉచితంగా అందించడం అభినందనీయమని నిర్వాహకులను అభినందించారు. రాగి అంబలి కేంద్రంతో నిరుపేదలకు, వృద్ధులకు ఎంతగానో ఉపయోగపడుతుందని ఎండలకు ఉపశమనంగా, ఆసరాగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ లాయక్‌అలీ, క్లబ్ సభ్యులు మహేశ్, లక్ష్మయ్య,తరుణ్, జగదీశ్, రాంచందర్, ఆశోక్ ఉన్నారు.

ధాన్యం కొనాలంటూ రైతుల రాస్తారోకో



బోడకొండ రోడ్డుపై బైఠాయించిన రైతులు

మంచాల: ధాన్యం కొనుగోలు చేయాలంటూ మండలంలోని బోడకొండ గ్రామంలో గురువారం రైతులు రాస్తారోకో చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ప్రభుత్వం పేరుకే గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసిందని ఆరోపించారు. నెల రోజులు కావస్తున్నా ధాన్యం సేకరించడం లేదని తెలిపారు. దీంతో వర్షాలకు ధాన్యం పాడవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తక్షణమే వరి ధాన్యం కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేశారు. రాస్తారోకో విషయం తెలుసుకున్న మంచాల ఇన్‌చార్జి సీఐ లింగయ్య అక్కడికి చేరుకొని రైతులతో మాట్లాడారు. సంబంధిత అధికారులతో చర్చించి ధాన్యం కొనుగోలు చేసేలా చూస్తామని హామీ ఇవ్వడంతో రైతులు రాస్తారోకో విరమించారు.

సంపూర్ణ ఆరోగ్యానికి యోగా సాధన మేలు



యోగా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఇస్మాయిల్ గురూజీ తదితరులు

హస్తినాపురం: సంపూర్ణ ఆరోగ్యంగా ఉండేందుకు ప్రతి ఒక్కరూ ప్రతిరోజూ యోగా సాధన చేయాల్సిన అవసరం ఉందని యోగా గురువు ఇస్మాయిల్ గురూజీ అన్నారు. హస్తినాపురంలోని మేజర్ పద్మపాణి ఆచార్య కమ్యూనిటీ హాల్‌లో ఈనెల 14 నుంచి ప్రారంభం కానున్న శ్రీషిర్డీ సాయి అష్టాంగ యోగా శిక్షణ తరగతుల బ్రోచర్‌ను గురువారం ఆయన కదారి చంద్రశేఖర్‌రెడ్డితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగాల్ గురూజీ మాట్లాడుతూ, ఈనెల 14 నుంచి ప్రతిరోజూ ఉదయం 5 నుంచి 7 గంటల వరకు, సాయంత్రం 6.30 నుంచి 8.30 గంటల వరకు యోగా శిక్షణ తరగతులు నిర్వహిస్తామన్నారు. ఇందులో వ్యాయామాలు, ప్రాణాయామాలు, ఆసనాలు, సూర్యనమస్కారాలు, ధ్యానం నేర్పిస్తామన్నారు. శిక్షణలో 14 నుంచి 80 సంవత్సరాల వయసు వారు పాల్గొనవచ్చన్నారు. కార్యక్రమంలో అలుగుబెల్లి వెంకట్‌రెడ్డి, సరిత, ప్రభాకర్ రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, ఉపేందర్, నరేందర్, మల్లికార్జున్, కవిత విజయ తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ రోడ్లను అభివృద్ధి చేస్తాం

మంత్రి సబితారెడ్డి

మహేశ్వరం: డబీల్‌గూడ గ్రామాభివృద్ధికి తనవంతు కృషిచేస్తామని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి అన్నారు. మండల పరిధిలోని డబీల్‌గూడ గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు గురువారం మంత్రిని ఆమె నివాసంలో కలిశారు. డబీల్‌గూడ–శంషాబాద్ రోడ్డు వరకు 800 మీటర్ల బీటీ నిర్మాణం చేయాలని కోరారు. మంత్రి మాట్లాడుతూ.. ఇప్పటికే ఈ రోడ్డు విస్తరణ, బీటీ రోడ్డుగా మార్చేందుకు రూ.15లక్షల నిధులు మంజూరు చేశామని.. నిధులు సరిపోకపోతే అదనంగా నిధులు మంజూరయ్యేలా చూస్తామని హామీ ఇచ్చారు. మహేశ్వరం–పెద్ద గోల్కొండ ఔటర్ రింగ్ రోడ్డు వయా మన్సాన్‌పల్లి చౌరస్తా బీటీ రోడ్డును నాలుగు వరుసల రోడ్డుగా నిర్మాణం చేస్తామన్నారు. మహేశ్వరం–స్టేషన్ తిమ్మాపూర్ వయా అమీర్‌పేట్ బీటీరోడ్డును కూడా విస్తరిస్తామన్నారు. గ్రామీణ రోడ్ల అభివృద్ధికి కృషిచేస్తామన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు రవీందర్, ఇస్తారీ, జంగయ్య, రాములు, కరుణాకర్, భానుప్రకాష్ సత్తయ్య, బాలకృష్ణగౌడ్, ప్రసాద్ పాల్గొన్నారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి

మున్సిపల్ చైర్మన్ అబ్దుల్లా సాది

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని చైర్మన్ అబ్దుల్లా సాది తెలిపారు. మున్సిపాలిటీ పరిధి పహాడీషరీఫ్ 14వ వార్డులో రూ.15 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను గురువారం ఆయన పరిశీలించారు. మున్సిపాలిటీ పరిధిలోని జల్‌పల్లి, పహాడీషరీఫ్, కొత్తపేట, షాహిన్‌నగర్ ప్రాంతాల్లో పెద్దఎత్తున అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయన్నారు. రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని రూ.10 కోట్లతో కొనసాగుతున్న బాక్స్ డ్రెయిన్ పనులను పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. మంత్రి సబితారెడ్డి చొరవతో అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు.మజ్లిస్ నాయకులు దస్తగిర్, షరీఫ్, అష్రఫ్ తదితరులు పాల్గొన్నారు.